సాక్షి మంచిర్యాల

శనివారం । 11 । నవంబర్ । 2023

కాకో ఆలయానికి పోటెత్తిన భక్తులు

దండేపల్లి: దండారీ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున ఉన్న పద్మల్‌పురి కాకో ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర ప్రాంతాల నుంచి గిరిజన భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించి కాకోను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో వంటలు వండి పంక్తి భోజనాలు చేశారు. ప్రత్యేక భజనలతోపాటు గుస్సాడీల నృత్యాలు, మహిళల సంప్రదాయ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

బాలల హక్కులపై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం లింగ వివక్షత, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ సౌజన్య మాట్లాడుతూ విద్యార్థినులకు బాలల హక్కులు, ఆపద సమయంలో సంప్రదించాలిన ఫోన్ నంబర్లను వివరించారు. చైల్డ్‌లైన్ 1098, పోలీస్ 100, మహిళ హెల్ప్‌లైన్ 181, సైబర్‌క్రైం హెల్ప్ లైన్ 1930 వినియోగం, కమిటీలపై వివరించారు. జెండర్ స్పెషలిస్టులు విజయ, మౌనిక పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/21.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల రిటర్నింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో కార్యాలయాన్ని డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సంతోష్ మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి శుక్రవారం వరకు నామినేషన్లు స్వీకరించామని, ఈ నెల 13న పరిశీలన ఉంటుందని తెలిపారు. అధికారులు ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 15న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ, 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ ఉంటాయని వివరించారు.

ఎన్నికల ఆర్వో కార్యాలయం తనిఖీ



రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న బిశ్వజిత్ దుత్తా

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) కార్యాలయాన్ని శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకుడు బిశ్వజిత్‌దుత్తా తనిఖీ చేశారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా కార్యాలయాన్ని సందర్శించి అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, రికార్డులు పరిశీలించారు. అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారో లేదో స్వయంగా పరిశీలన చేశారు. ఎన్నికల నిర్వహణ పనులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాహుల్, బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎనిమిది చోట్ల ఎంసీపీఐ(యూ) పోటీ

బెల్లంపల్లి: రాష్ట్రంలో ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఎంసీపీఐ(యూ) పోటీ చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సింగతి సాంబయ్య తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీకి పట్టున్న నర్సంపేట, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, పరకాల, వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో పోటీ చేస్తోందని వివరించారు. మిగతా జిల్లాల్లో ఆయా జిల్లా కమిటీలు ఎవరికి మద్దతు ఇవ్వాలో నిర్ణయం తీసుకుంటాయని తెలిపారు. మంచిర్యాల జిల్లా ఎంసీపీఐ(యూ) కార్యదర్శిగా సబ్బని రాజేంద్రప్రసాద్‌ను నియమించినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, నాయకుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

పోలీసులు సమన్వయంతో పని చేయాలి

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు సజ్జన్ ఆర్ అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయాన్ని కలెక్టర్ సంతోష్, పోలీసు పరిశీలకులు ఆర్ ఇలాంగో, మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్‌లతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్టీయూ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా కమిటీని ఎన్నికల పర్యవేక్షణ అధికారి ఎస్టీయూ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సతీష్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా పోకల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బీసోగాని శంకర్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిలర్‌గా కరుణాకర్, ఆర్థిక కార్యదర్శిగా సత్తయ్య, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పద్మ, క్రిష్ణ, అడిషనల్ సెక్రెటరీగా విశ్వనాథ్ స్వప్నదేవి, పద్మప్రియ, ఫైనాన్స్ కమిటీ సభ్యులుగా మాధవి, మహలక్ష్మీ ఎన్నికయ్యారు. ఎన్నికల

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు భారీ సంఖ్యలో దాఖలు
- చెన్నూర్ నియోజకవర్గంలో అత్యధికం
- సమయం మించిపోవడంతో ఇద్దరు వెనక్కి

జిల్లాలో నామినేషన్ల వివరాలు

	అభ్యర్థులు	సెట్లు
మంచిర్యాల	26	44
బెల్లంపల్లి	25	46
చెన్నూర్	29	53



చెన్నూర్ బీజేపీ అభ్యర్థిగా రెండో సెట్ నామినేషన్‌ను ఆర్వోకు అందజేస్తున్న దుర్గం అశోక్

మంచిర్యాలఅగ్రికల్చర్/బెల్లంపల్లి/చెన్నూర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారం ముగిసింది. ఈ నెల 13న నామినేషన్లు పరిశీలన నిర్వహించనున్నారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో ఈ నెల 3న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం ఇప్పటివరకు మొత్తంగా 80 మంది 143సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఇప్పటికే నామినేషన్లు వేసిన అభ్యర్థులు ఒక సెట్, రెండు సెట్లు వేయగా, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు పోటీ పడ్డారు. మంచిర్యాలలో ఆఖరి నిమిషంలో వచ్చిన భీమిని మండలం బిట్టూరిపల్లి గ్రామానికి చెందిన దశరథం తన సోదరితో కలిసి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి పరుగులు పెట్టారు. ఆలస్యంగా వచ్చిన మరో ఇద్దరిని పోలీసులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం 24నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి అరగంటలో బీజేపీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లితోపాటు స్వతంత్రులు ఒకేసారి వచ్చారు. ఆఖరి అభ్యర్థి నామినేషన్ స్వీకరణకు సాయంత్రం 5.40గంటల వరకు సమయం పట్టింది. మొత్తంగా మంచిర్యాల నియోజకవర్గంలో 26 మంది 44 సెట్లు దాఖలు చేశారు. రఘునాథ్ వెరబెల్లి(బీజేపీ), తోట శ్రీనివాస్(బీఎస్పీ), ఎదునూరి రమేష్(డీఎస్పీ), ఎండీ.ఇఫ్కార్ హమీద్(పాట పార్టీ), చెరుకూరి శాంతిశ్రీ(బీఆర్ఎస్‌పీ), దుమ్మాటి రవికుమార్(ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), మేకల శంకర్(ఆబాద్ పార్టీ), మామిడి విజయ్(గోండ్వాన గణతంత్ర పార్టీ), పోలంపల్లి మహేష్(యుగతులసి) స్వతంత్రులుగా నయీంపాషా, కొట్టె సంజీవ్ కుమార్, మొగిళి కృష్ణ, అందె మంగ, జి.సాయి, మహ్మద్ కలీం, హనుమండ్ల శంకర్, రామటెంకి దశరథం నామినేషన్లు వేశారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆఖరు రోజు శుక్రవారం ప్రధాన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు వేశారు. 20 మంది అభ్యర్థులు 26 సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.రాహుల్‌కు అందజేశారు. మొత్తంగా 25మంది అభ్యర్థులు 46 నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇతర రాజకీయ పక్షాలు, స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సిద్ధపడ్డారు. రాజకీయ పార్టీల నుంచి 15 మంది అభ్యర్థులు, స్వతంత్రులు 10 మంది నామినేషన్ పత్రాలు సమర్పించారు. చివరి రోజు నామినేషన్ పత్రాలు అందజేసిన అభ్యర్థుల వివరాలను రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. గడ్డం వినోద్(కాంగ్రెస్) మూడు సెట్లు, శ్రీపతి రామగిరి(బీసీవై), ఎడ్ల పద్మ(బీఎంపీ), దాగం శ్రీనివాస్(స్వతంత్ర), దుర్గం చిన్నయ్య(బీఆర్ఎస్) రెండేసి సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. గంధం రమేష్(స్వతంత్ర), గంధం శంకర్(ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ), జంగపల్లి రామస్వామి(డీఎస్పీ), పట్టి వెంకటకృష్ణ(బీజేపీ), విక్టోరియా(డీబీపీ), జాడి నర్సయ్య(బీఎస్పీ), రామటెంకి శ్రీనివాస్(రిపబ్లికన్‌పార్టీ ఆఫ్‌ఇండియా), దుర్గం ఈశ్వర్(స్వతంత్ర), పెరుగు రవీందర్(సోషలిస్టు పార్టీ), కట్ల రాంకుమార్(స్వతంత్ర), సున్నం రాజు(యుగ తులసి), లింగంపల్లి మధుకర్(గనసురక్ష), రాదండి ఉమ(స్వతంత్ర), కొయ్యల ఏమాజీ(స్వతంత్ర), డోంగ్రే చేతన్(బహుజన్ లెఫ్ట్‌పార్టీ) నామినేషన్ వేశారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి శుక్రవారం వరకు 29 మంది అభ్యర్థులు 53 నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు 34 మంది 34 సెట్లు అందజేశారని ఎన్నికల అధికారి సిడాం దత్తు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ తరఫున రెండు సెట్లను పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, బీజేపీ అభ్యర్థి దుర్గం అశోక్ రెండు సెట్లను బీజేపీ పెద్దపల్లి పార్లమెంటరీ కో కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, అశోక్ సతీమణి అరుణ దాఖలు చేశారు. బీఎస్పీ అభ్యర్థి దాసరపు శ్రీనివాస్, సతీమణి విద్యావర్థినిలు కలిసి మూడు సెట్లు, బీజేపీ రెబెల్ అభ్యర్థిగా అందుగుల శ్రీనివాస్, కాంగ్రెస్ రెబెల్‌గా రామిళ్ల రాధిక, స్వతంత్ర అభ్యర్థులు చాకినారపు కిరణ్‌కుమార్, దుర్గం సమ్మయ్య, జాడి యేసయ్య, బీఎస్పీ రెబెల్‌గా తుంగపిండి రమేశ్, అసంపల్లి రమేశ్, మోతె తిరుపతి, సోగాల సంజీవ్, బత్తుల సరిత, మరికొందరు స్వతంత్రులు నామినేషన్లు వేశారు.



చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున నామినేషన్ అందజేస్తున్న ఎంపీ వెంకటేశ్‌నేత

ఖానాపూర్ నియోజకవర్గంలో..

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో చివరి రోజు 13 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో జీవాకర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నుంచి బొజ్జు తరఫున నాయకులు, బీఆర్ఎస్ నుంచి జాన్సన్‌నాయక్ తరఫున పార్టీ నాయకులు, స్వతంత్ర అభ్యర్థులుగా బొంత ఆశారెడ్డి, ఆత్రం రవీందర్, చౌహాన్ సేవదాస్, ఆత్రం భీంరావు, బీఎస్పీ నుంచి రాథోడ్ బన్సీలాల్, రాథోడ్ కళ్యాణి, ధర్మ సమాజ్ పార్టీ నుంచి జాదవ్ ప్రభాస్, బీజేపీ నుండి రితేశ్‌రాథోడ్, రాథోడ్ రమేశ్ వేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నుంచి శుక్రవారం వరకు 17 మంది అభ్యర్థులు 26 సెట్ల నామినేషన్లు వేశారు.



బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి చిన్నయ్య పక్షాన



బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వినోద్ నామినేషన్

కేసీఆర్ విఫలయ్యారని..



నామినేషన్‌కు పరుగులు తీస్తున్న దశరథ్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉద్యమ సమయంలో మాటలు, రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇచ్చిన హామీల అమలులో కేసీఆర్ విఫలమయ్యారని మంచిర్యాల భీమిని మండలం బిట్టూర్‌పల్లి గ్రామానికి చెందిన రాంటెంకి దశరథ్ శుక్రవారం మంచిర్యాలలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశాడు. 2004 నుంచి తెలంగాణ ఉద్యమకారుడిగా పని చేశానని, 2009 నుంచి ఇప్పటివరకు 14ఏళ్లు చెప్పులు వేసుకోకుండా తిరుగుతున్నానని తెలిపాడు.

అన్నదమ్ములా.. మజాకా !

- జిల్లా రాజకీయంపై 'గడ్డం బ్రదర్స్' ప్రభావం
- వినోద్, వివేక్ రాకతో ఆశావహుల టికెట్లకు గండి
- చెన్నూరు, బెల్లంపల్లిలో అనూహ్య పరిణామాలు
- ఎన్నికల వేళ పీఎస్సార్‌తో వైరం మరచి దోస్తీ



పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు మోహన్‌జోషితో వివేక్, పీఎస్సార్, వినోద్, రమేశ్, స్వామి అభివాదం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో 'గడ్డం బ్రదర్స్' చేస్తున్న రాజకీయం ఆసక్తికరంగా సాగుతోంది. వీరిద్దరి రాక జిల్లా రాజకీయాలపై ప్రభావం చూపుతోంది. జిల్లాలోని మూడు ప్రధాన నియోజకవర్గాల్లో శుక్రవారం నాటితో నామినేషన్ల దాఖలు ఘట్టం ముగిసింది. పార్టీలకు రెబెల్స్ బెడద పెద్దగా లేనప్పటికీ బెల్లంపల్లి, చెన్నూర్ స్థానాల్లో మాత్రం కాంగ్రెస్, బీజేపీ నాయకుల్లో టికెట్ల అసంతృప్తి చిచ్చు ఆరడం లేదు. మాజీ మంత్రి వినోద్, మాజీ ఎంపీ వివేక్ రంగప్రవేశంతో ఈ రెండు పార్టీల్లో ఆశావహుల రాజకీయ భవిష్యత్ తారుమారైంది. జిల్లాలో అన్నదమ్ముల పోటీ ఇటు కాంగ్రెస్.. అటు బీజేపీ, సీపీఐలోనూ ప్రభావం చూపడం గమనార్హం. ఇప్పటికీ వీరిద్దరు తమ ఆశలకు గండి కొట్టారనే బాధ నాయకుల్లో ఉన్నా.. ఎన్నికల వేళ 'చేయి' కలిపినట్లుగా పని చేస్తున్నారు.

వివేక్ అనుచరుడని 'అందుగుల'కు బ్రేక్

మాజీ ఎంపీ వివేక్ బీజేపీలో ఉన్నంతకాలం అందుగుల శ్రీనివాస్ ఆయనకు అనుచరుడిగా ఉన్నారు. వివేక్ చెన్నూర్ నుంచి పోటీ చేయకపోతే 'అందుగుల'కే టికెట్ అన్నట్లుగా ప్రచారం సాగింది. 2018లో పోటీ చేసి ఓడిపోయిన ఈయన మరోసారి టికెట్ వస్తుందనే భరోసాతో ఉన్నారు. చివరి క్షణంలో వివేక్ జెండా మార్చడం ఆయన అనుచరుడైన 'అందుగుల' అవకాశాలను దెబ్బతీసింది. బీజేపీ మరో అభ్యర్థి వైపు చూసింది. చివరికి నేతకాని సామాజిక వర్గం నుంచి గత కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్న దుర్గం అశోక్ వైపు బీజేపీ మొగ్గు చూపింది. దీంతో 'అందుగుల' రెబెల్‌గా నామినేషన్ వేశారు. మరో నాయకుడు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పత్తి శ్రీను కూడా వివేక్‌తో విభేదించి బీఆర్ఎస్‌లో చేరారు.

చల్లబడ్డ నూకల, నాతరీ

టీపీసీసీ స్ట్రాటజీ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు అండతో చెన్నూరు, బెల్లంపల్లి సీట్లపై ఆశలు పెట్టుకున్న నూకల రమేశ్, నాతరీ స్వామికి టికెట్లు దక్కక అసంతృప్తితో ఉన్నారు. బెల్లంపల్లిలో అన్న వినోద్ పోటీతో నాతరీ, చెన్నూరులో తమ్ముడు వివేక్ రాకతో నూకల రమేశ్‌కు దెబ్బపడింది. చివరకు నూకలకు జెడ్పీ చైర్‌పర్సన్, నాతరీకి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అవకాశమిస్తామనే హామీలతో రెబెల్‌గా నామినేషన్లు వేయకుండా చల్ల బడ్డారు. చిలుముల శంకర్, రొడ్డ శారద వెనక్కి తగ్గారు. చెన్నూరు సీటుపైనే ఆశలు పెట్టుకున్న మాజీ మంత్రి బోడ జనార్దన్, డాక్టర్ రాజారమేశ్ బీఆర్ఎస్‌లో చేరగా, రామిళ్ల రాధిక రెబెల్‌గా, దాసారపు శ్రీనివాస్ బీఎస్పీలో చేరి నామినేషన్ వేశారు.

రెబెల్‌గా ఏమాజీ

తనకు టికెట్ రాకుండా మాజీ ఎంపీ వివేక్ కుట్ర చేశారని ఆరోపిస్తున్న బీజేపీ నాయకుడు కొయ్యల ఏమాజీ రెబెల్‌గా నామినేషన్ వేశారు. వినోద్ గెలుపు కోసం తనను బలి చేశారని మండిపడుతున్నారు. మరో నాయకుడు పట్టివెంకట క్రిష్ణ సైతం నామినేషన్ వేశారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవిని వివేక్ ప్రతిపాదించారని, ఆయన పార్టీ మారాక ఆమెను మార్చి తనకే టికెట్ ఇవ్వాలని ఏమాజీ పలుమార్లు నిరసనలు వ్యక్తం చేశారు. శుక్రవారం బెల్లంపల్లి బీజేపీ అభ్యర్థి పేరు మార్పుతో జాబితా విడుదల కావడంపై గందరగోళం రేపింది. మళ్లీ శ్రీదేవికే బీఫారం ఇవ్వడంతో స్పష్టత వచ్చింది. ఏమాజీకి మాత్రం గడ్డం బ్రదర్స్‌పై కోపం తగ్గడం లేదు.

పీఎస్సార్‌తో దోస్తీ !

ప్రేంసాగర్‌రావు(పీఎస్సార్), వినోద్ వైరం అందరికీ తెలిసిందే. చెక్ బౌన్స్ కేసుతోపాటు తమ నాయకుల టికెట్ అవకాశాలకు గండి కొట్టారని పీఎస్సార్ వారితో విభేదించారు. పార్టీలో కష్టపడే వారికే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ వీరిద్దరి రాకతో వారెవరూ టికెట్ రేసులోనే లేకుండా పోయారు. తాజాగా పీఎస్సార్‌తో దోస్తీకి మంతనాలు నడుస్తున్న క్రమంలో పరిణామాలు మారుతున్నాయి. ఇక టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వైపు గడ్డం బ్రదర్స్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వైపు ఉన్న పీఎస్సార్ వర్గంగా ఉన్న వీరివురు.. ఎలా కలసి నడుస్తారనేదే ఆసక్తికరంగా మారింది.

సీపీఐ సీటు గల్లంతు

కాంగ్రెస్, సీపీఐ మధ్య 'చెన్నూరు' పొత్తు పొడవకుండానే ముగిసిపోయింది. ఈ సీటుపైనా గడ్డం సోదరుల ప్రభావముంది. తమకు బెల్లంపల్లి టికెట్‌ను సీపీఐ అడిగింది. అక్కడ వినోద్ పోటీకి దిగడంతో ఒప్పుకోలేదు. చివరకు చెన్నూరు ఇస్తామనే ప్రతిపాదనలు వచ్చాయి. కొన్నాళ్లు టికెట్ పెండింగ్‌లో పెట్టి, చివరకు వివేక్‌కు కాంగ్రెస్ కండువా వేయడంతో సీపీఐ ఆశలు గల్లంతయ్యాయి. ఇక రాష్ట్ర స్థాయి పొత్తులో జిల్లాలోని కామ్రేడ్లు తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేస్తున్నారు.

నేడు బెల్లంపల్లికి రేవంత్‌రెడ్డి రాక


- తిలక్‌స్టేడియంలో బహిరంగ సభ
- ఏర్పాట్లు పూర్తి చేసిన కాంగ్రెస్ పార్టీ



తిలక్ స్టేడియంలో సిద్ధం చేస్తున్న వేదిక

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల బహిరంగ సభను భారీ ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. పాతబస్టాండ్ ఏరియాలోని సింగరేణి తిలక్ స్టేడియంలో సభ నిర్వహించనున్నారు. ఈ సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వినోద్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించనున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీతోపాటు అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పెద్ద ఎత్తున జనాన్ని సమీకరించాలని పార్టీ నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు కాంగ్రెస్ శ్రేణులు జన సమీకరణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఏసీపీ పంతాటి సదయ్య సభకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను గుర్తించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ప్రణాళిక రచించారు. బెల్లంపల్లి శివారు ప్రాంతాలైన పోచమ్మగుడి, స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్‌జోన్ యూనిట్, కొత్త ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, సింగరేణి పాత జీఎం కార్యాలయం, సీఎస్ఐ స్కూల్, శాంతిఖనికి వెళ్లే మార్గాన్ని వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. కాగా, రేవంత్‌రెడ్డి బహిరంగ సభ కోసం బెల్లంపల్లిలోని ముఖ్య ప్రాంతాలు, చౌరస్తాలను కాంగ్రెస్ జెండాలతో ముస్తాబు చేశారు.

అట్టహాసంగా జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు



పోటీల్లో పతకాలు అందుకున్న క్రీడాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హాజీపూర్ మండలం గుడిపేటలోని మహాత్మ జ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు రసవత్తరంగా సాగాయి. అండర్–14 బాలుర, అండర్–17 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

- జాగో తెలంగాణ కన్వీనర్ మురళి



వాకర్స్‌తో మాట్లాడుతున్న మురళి

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట: అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తూ కుటుంబ పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని జాగో తెలంగాణ కన్వీనర్, విశ్రాంత కలెక్టర్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక జాగో తెలంగాణ పేరుతో చేపట్టిన ఓటరు చైతన్య యాత్ర శుక్రవారం మంచిర్యాల, లక్సెట్టిపేటలో సాగింది. మంచిర్యాల జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో వాకర్స్‌తో సమావేశమయ్యారు. లక్సెట్టిపేట అంబేద్కర్ చౌరస్తా వద్ద మాట్లాడారు. విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారిందని, ఉద్యోగాల భర్తీలో, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. బస్సు యాత్ర ఈ నెల 12న ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, సమన్వయకర్త నైనాల గోవర్ధన్, ప్రొఫెసర్లు పద్మజాషా, లక్ష్మీనారాయణ, కళిదా పర్వీన్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, దళిత బహుజన ఫ్రంట్ కన్వీనర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం సిద్ధం చేయాలి

- పోలీస్ శాఖ పరిశీలకులు ఆర్.ఇలాంగో



లెక్కింపు కేంద్రంలో పరిశీలకులు ఇలాంగో

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/మంచిర్యాలక్రైం: ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సిద్ధం చేసి ఉంచాలని పోలీసు శాఖ పరిశీలకుడు ఆర్.ఇలాంగో అన్నారు. హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రం, మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ స్వామిరాజ్ ఉన్నారు. ఇలాంగో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రంలో వసతులు, సౌకర్యాల కల్పన త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. చుట్టూ ఉండే కంచెలు, పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతల పరిరక్షణలో బందోబస్తు ఏర్పాట్లపై సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూంల వద్ద జనరేటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరు, సీసీ ఫుటేజీలు పరిశీలించారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్, సీఐ తోట సంజీవ్, ఎస్సై నరేశ్‌కుమార్, పాల్గొన్నారు.

ప్రతీ అంశంపై అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్ దత్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు బిశ్వజిత్ దత్తా అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్, సోషల్ మీడియా సెల్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సందర్శించారు. రిజిష్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రకటనల దరఖాస్తులను త్వరగా పరిశీలించి నిబంధనలకు లోబడి అనుమతించాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, ఇతర ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, 1950, సీ–విజిల్ తోపాటు ఆఫ్‌లైన్‌లో అందించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. జిల్లా పౌరసంబంధాల అధికారి వై.సంపత్‌కుమార్, నోడల్ అధికారి వినీత, సోషల్ మీడియా సెంటర్ సూపర్‌వైజర్, ఈడీఎం సునీల్ పాల్గొన్నారు.



పరిశీలకులు బిశ్వజిత్ దత్తా, కలెక్టర్ సంతోష్

క్లుప్తంగా

కిరాణాషాప్‌లో చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజశేఖర్

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లిలోగల ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సైఫ్ కిరాణాషాప్ తాళాలు పగులగొట్టి రూ.20 వేల నగదు, రూ.5వేల విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. షాపు యాజమాని ఫిర్యాదు మేరకు ఎస్సై శుక్రవారం క్లూస్ టీంతో కలిసి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు


కుమార్ (ఫైల్)

తాండూర్: మండలంలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన గోలెం కుమార్ (38) అదృశ్యమయ్యాడు. ఏఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమార్ గురువారం కూలీ పనులకు వెళ్లి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతడి కుమారుడు వంశీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. కుమార్ ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు లేదా అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని సూచించారు.

నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో పోలీసులు

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీసులు ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నస్పూర్ గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌పై వెళ్తున్న గోవిందుల మల్లేశ్ అనే వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా అతడి వద్ద రూ.4 లక్షల నగదు దొరికింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల ప్రకారం తగిన ధ్రువీకరణ పత్రాలు, రసీదులు చూపకపోవడంతో ఆ మొత్తాన్ని సీజ్ చేసి ఎఫ్ఎస్ టీంకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఏఐఎఫ్‌డీవైకి జిల్లా కార్యదర్శి వెంకటేశ్ రాజీనామా

బెల్లంపల్లి: ఏఐఎఫ్‌డీవై జిల్లా కార్యదర్శి పసుపులేటి వెంకటేశ్ ఆ సంఘానికి శుక్రవారం రాజీనామా చేశారు. శనివారం బెల్లంపల్లిలో నిర్వహించనున్న బహిరంగసభకు హాజరుకానున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి వినోద్ కోరిక మేరకే తాను పార్టీ మారుతున్నట్లు తెలిపారు.

గుడుంబా పట్టివేత


బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కెరమెరి: మండలంలోని సొమ్మగూడ శివారులో శుక్రవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్సై సయ్యద్ మోసిన్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. 1,600 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి పారబోశారు. అనంతరం ధారవత్ తిరుపతి ఇంట్లో 20 లీటర్ల గుడుంబా లభించగా స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశారు. సిబ్బంది విజయలక్ష్మి, సురేశ్, మహేశ్, మమత తదితరులున్నారు.

సెల్‌ఫోన్‌లో ప్రచార గోల..!



- మొబైల్‌లోనే చర్చోపచర్చలు
- నెట్ డాటా, చార్జింగ్ ధమాల్
- జనాలకు తప్పని 'ఓటు'పాట్లు

జంగ్ తెలంగాణ

మంచిర్యాలఅర్బన్: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారమంతా సెల్‌ఫోన్ చుట్టూ తిరుగుతోంది. ఓవైపు ప్రచార రథాలు.. ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నా.. ఖర్చులేకుండా ఓటర్లను వేగంగా (క్షణాల్లో) ఆకర్షించేందుకు అభ్యర్థులు సెల్‌ఫోన్‌పై ఆధారపడుతున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తుండగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే పార్టీలన్నీ సోషల్ మీడియా ప్రచారకర్తలను నియమించుకుని ప్రచారాన్ని వేగవంతం చేశాయి. ఆయా పార్టీల అభ్యర్థుల ఫొటోలు, గుర్తులతో.. పార్టీలు ఏమి చేస్తాయో చెబుతూనే.. ఎదుటి వ్యక్తి లోపాలు ఎత్తి చూపుతున్నారు. వ్యక్తిగత దూషణల పర్వం కొనసాగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రూపుల్లో ప్రచారం సాగిస్తున్నారు. సెల్‌ఫోన్ నెట్ ఆన్ చేశారో.. లేదో ఇలా వాట్సప్‌లో వివిధ పార్టీల మెస్సేజ్‌లు వస్తున్నాయి. ఓ పార్టీ ఎన్నికల సమావేశాలు నిర్వహించే చోట వంట, టెంట్, ఎన్నికల అవసరాల కోసం నియమించిన కమిటీలకు సమాచారం చేరవేయటానికి వాట్సప్ గ్రూపుల కమిటీలు ఏర్పాటు చేశారు. నేరుగా మాట్లాడేందుకు సమయం లేకపోవటంతో గ్రూప్ కాల్స్‌పై ఆధారపడుతున్నారు. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల సమాచారం చేరవేసేందుకు సెల్‌ఫోన్లు కీలకంగా మారాయి.

చర్చలే చర్చలు

టీవీల్లో డిబేట్‌ల మాదిరిగా వాట్సప్ గ్రూప్‌లో ఎన్నికల వేళ చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థుల పనితీరు.. ఇతర విషయాలపై విశ్లేషణలు లేకపోలేదు. ఎత్తిపొడిచే సందేశాలు కూడా లేకపోలేదు. ఇదివరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో చౌరస్తాల వద్ద సాగే ఎన్నికల ముచ్చటంతా సెల్‌ఫోన్‌లో కొనసాగుతోంది. అనుకూల, వ్యతిరేక సందేశాలు (మెస్సేజ్‌లు) సెల్‌ఫోన్‌లోనే కొనసాగుతున్నాయి. అసంతృప్త నేతలంతా వాట్సప్ కాల్ వినియోగిస్తూ బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒక్క నియోజకవర్గం కాకుండా ఇతర నియోజకవర్గాల గెలుపోటములపై ఆరా తీయటం కనిపిస్తోంది. నలుగురు కలిస్తే సాగే చౌరస్తా ముచ్చట్లన్నీ సెల్‌ఫోన్‌లకు మారాయన్న మాట.

నెట్ ఆన్ చేస్తే చాలు..

ఎన్నికల వేళ సెల్‌ఫోన్ నెట్ ఆన్ చేయాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. మొబైల్ డాటా ఆన్‌చేశారో లేదో.. వందలాది పోస్టులు ఒకేసారి వస్తున్నాయి. దీంతో రోజువారీ నెట్ డాటా గంటల్లో ఖర్చవుతోంది. మరోవైపు బ్యాటరీ చార్జింగ్ దిగిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఏమనలేక గమ్మున ఉండాల్సిన పరిస్థితి సామాన్యులది.

ఓటర్లకు ఇక్కట్లు

సెల్‌ఫోన్‌లో ఎన్నికల ప్రచారమాటెలా ఉన్నా ఓటర్లకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇదివరకు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సెల్‌ఫోన్ నంబర్లు సేకరించేవారు. ప్రస్తుతం ఎవరికి వారే సోషల్ మీడియా గ్రూపులు క్రియేట్ చేస్తూ వారిని అందులో చేర్చుతున్నారు. పదుల సంఖ్యలో ఫొటోలు, వీడియోలు, ఒకేసారి గ్రూపులో పోస్టు చేస్తుండటంతో సగటు ఓటరుకు తిప్పలు తప్పడం లేదు. అవసరమున్న సమాచారం కంటే అనవసర ఎన్నికల సందేశాల గోల ఎక్కువ కావటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇంకోవైపు గ్రూపు నుంచి నిష్క్రమిద్దామంటే నంబర్‌యాడ్ చేసిన వ్యక్తులు ఏమనుకుంటారో.. అని మొహమాటపడాల్సి వస్తోంది. సందేశాలు కూడా చదవటానికి వీల్లేకుంటున్నాయి. ఒకే గ్రూపులో అనుకూల, వ్యతిరేక పోస్టులు వస్తుండటంతో ఓటరు గందరగోళానికి గురవుతున్నారు. తటస్తులు మాత్రం చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఉంది.

'మా ఓటు మీకే..'

- ఏ అభ్యర్థి వచ్చినా ఓటరుది ఒకేమాట!



దండేపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బరిలో ఉన్న అభ్యర్థులతోపాటు వారి తరఫున ఆయా పార్టీల ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు, బంధువులు పట్టణాలు, గ్రామాల్లో పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. దీంతో అభ్యర్థులు, నాయకులకు తగ్గట్లుగా ఓటర్లు కూడా వచ్చిన అన్ని పార్టీల నాయకులకు 'మా ఓటు మీకే అంటూ' అందరికీ ఒకే సమాధానం చెప్పి సంతృప్తి పరిచి పంపుతున్నారు.

గల్ఫ్ సమస్యలపై అభ్యర్థులను నిలదీయాలి

- గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న


సమావేశంలో మాట్లాడుతున్న భూమన్న

జన్నారం: వచ్చే ఎన్నికల్లో ఓటు కోసం వచ్చే అభ్యర్థులను గల్ఫ్ సమస్యలపై నిలదీయాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమన్న కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గల్ఫ్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ విస్మరించిందని ఆరోపించారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేసినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం, ప్రతి పక్షాలను గల్ఫ్ సమస్యలపై వేడుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన వారికే ఓట్లు వేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతిగౌడ్, గౌరవాధ్యక్షుడు సేపూరి గోపాల్, ప్రచార కార్యదర్శి మహ్మద్ హసన్, సలహాదారు మగ్గిడి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య, నాయకులు నరేశ్, తిరుపతి, అంజన్న, రాజేశ్ తదితరులున్నారు.

లారీ క్లీనర్ మిస్సింగ్


సంకేత్ అనిల్ దవన్

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ లారీ యార్డు నుంచి మహారాష్ట్రకు చెందిన సంకేత్ అనిల్ దవన్ అనే లారీ క్లీనర్ మిస్సింగ్ అయినట్లు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని తిరుపతినగర్‌కు చెందిన లారీ క్లీనర్ సంకేత్ ఈనెల 9న అన్‌లోడ్ కోసం దేవాపూర్ సిమెంట్ కంపెనీకి ఉదయం 2గంటలకు వచ్చాడు. డ్రైవర్‌తోపాటు లారీలో నిద్రించి ఆ తర్వాత ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లాడు. 24 ఏళ్ల సంకేత్ ఎవరికైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

పల్లె ప్రకృతివనంలో చెట్ల నరికివేత


నరికివేతకు గురైన చెట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతివనంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 24,648 చెట్లను నరికివేశారు. గత నెలలో కూడా ఇదే ప్రకృతివనంలో రెండుసార్లు సుమారు 1,495 చెట్లను కొట్టివేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి తిరుమల చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో శ్రీనివాస్ శుక్రవారం బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ప్రకృతి వనంలో మొత్తం 27,743 చెట్లకు గాను 1,257 చెట్లు మాత్రమే మిగిలాయని పేర్కొన్నారు. మిగతా చెట్ల సంఖ్య నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. నెల రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇలా ప్రకృతి వనంలో చెట్లు నరుకుతుండటం గమనార్హం.

ఆత్మారాంనాయక్ ఆస్తులు రూ.91.50 లక్షలు

- నామినేషన్ అఫిడవిట్‌లో పేర్కొన్న ఆసిఫాబాద్ బీజేపీ అభ్యర్థి

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆత్మారాంనాయక్ ఆస్తి విలువ రూ.91.50 లక్షలుగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన వద్ద రూ.లక్ష నగదు, తన భార్య సంధ్య వద్ద రూ.50వేల నగదు ఉన్నట్లు వివరించారు. ఇందులో రూ.45.50 లక్షల విలువ చేసే చరాస్తులు, రూ.46 లక్షల విలువ చేసే స్థిరాస్తులున్నాయి. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎల్ఐసీ పాలసీలు, రూ.5లక్షల విలువైన ఇన్నోవా వాహనం, రూ.3లక్షల విలువ చేసే జాన్‌డీర్ ట్రాక్టర్‌తో పాటు రూ.3 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలున్నాయి. రెబ్బెన మండలం ఖైర్‌గూడలో నివాస స్థలంతోపాటు రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ భూములున్నాయి. తన భార్య సంధ్య పేరిట మొత్తం రూ.3,10,06,756 విలువైన ఆస్తులున్నాయి. వీటిలో రూ.1,04,06,756 విలువైన చరాస్తులు, రూ.1.96 కోట్ల స్థిరాస్తులున్నాయి. రూ.53 లక్షల విలువైన టయోటా ఫార్చునర్ కారు, రూ.15 లక్షల విలువైన 250 గ్రాముల బంగారం ఉంది. వీటితో పాటు వ్యవసాయ భూములు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఆత్మారాం పేరిట రూ.1.50 లక్షల పంట రుణం ఉండగా, తన భార్య సంధ్య పేరిట రూ.14 లక్షలు సుందరం ఫైనాన్స్ వాహన రుణం ఉన్నట్లు అఫిడవిట్‌లో వివరించారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆస్తులు రూ.21 లక్షలు


ప్రవీణ్‌కుమార్

కౌటాల: సిర్పూర్(టి) బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రేపల్లె శివప్రవీణ్‌కుమార్ తన ఆస్తుల వివరాలు వెల్లడించారు. శుక్రవారం సిర్పూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తన నామినేషన్ సందర్భంగా ఎన్నికల అఫిడవిట్‌లో ప్రస్తావించారు. బ్యాంక్‌లో నగదుతో పాటు ఆర్ఎస్పీ వద్ద 50 గ్రాముల బంగారు ఆభరణాలున్నాయి. వాటి విలువ రూ.2,83,250గా ఉంది. కాగజ్‌నగర్ మండలం కోసినిలో రూ.13.55 లక్షల విలువైన భవనం ఉంది. మొత్తం స్థిరాస్తులు రూ.5,54,750 ఉన్నట్లు వెల్లడించారు. మొత్తం తన ఆస్తులు రూ.21,93 లక్షలుగా ప్రకటించారు. అతడి సతీమణి లక్ష్మీబాయి బ్యాంక్ ఖాతాలో నగదుతోపాటు 150 గ్రాముల బంగారు ఆభరణాలున్నాయి. వాటి విలువ రూ.31,46,637గా పేర్కొన్నారు. కుమారుడు పునీత్ పేరిట బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లు రూ.2,83,906 ఉన్నాయి. కుమార్తె శ్వేత పేరిట రూ.17,60,351 నగదు ఉంది. కేసులు లేవని అఫిడవిట్‌లో ఎన్నికల అధికారులకు తెలిపారు. మొత్తం కుటుంబ సభ్యుల ఆస్తులు రూ.73,83,894గా ఉన్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడిపేటకు చెందిన దుర్గం మారుతి (26) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపేటకు చెందిన దుర్గం మారుతి తన బైక్‌పై లక్సెట్టిపేటలోని జెండా వెంకటపూర్‌లోగల అత్తగారింటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో దొనబండకు చేరుకోగా మంచిర్యాల వైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మారుతి తీవ్రంగా గాయపడ్డాడు. కాలు తెగి దూరాన ఎగిరిపడింది. చేయి విరిగింది. తలకూ గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

వాహనం బోల్తాపడి బీఎస్పీకార్యకర్తలకు..

సిర్పూర్(టి): మండలకేంద్రంలో నిర్వహించిన బీఎస్పీ నామినేషన్ కార్యక్రమానికి వస్తున్న పార్టీ కార్యకర్తలు శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. సిర్పూర్(టి)–పెద్దబండ గ్రామాల మధ్య కాగజ్‌నగర్ వైపు నుంచి వస్తున్న బొలేరో ట్రాలీ ప్రమాదవశాత్తు బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న సుమారు 25 మంది బీఎస్పీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు, బీఎస్పీ నాయకులు మండలకేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేర్చారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్ పట్టణానికి తరలించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

భైంసా: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారని ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ కేరళ తిరువనంతపురం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు అన్ని విధాలుగా సహకరిస్తామని డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు.

ఉచిత వైద్యం అందని ద్రాక్ష..!

- సింగరేణి రిటైర్డ్ కార్మిక కుటుంబాలకు అందని సేవలు
- వైద్యం చేస్తే తప్పని ఫీజు రికవరీ
- గతంలో లేదంటున్న బాధితులు


మందమర్రిలోని కళ్యాణిఖని డిస్పెన్సరీ

మందమర్రిరూరల్: సింగరేణిలో 30, 40 ఏళ్ల పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులు, వారి కుటుంబాలకు ఉచిత వైద్యం అందడంలేదు. సంస్థలో ఉద్యోగం చేసినంత వరకే యాజమాన్యం అన్ని సౌకర్యాలు కల్పించి ఆ తర్వాత విస్మరిస్తోంది. ఉద్యోగ విరమణ తర్వాత క్వార్టర్‌లో ఉండనీయడం లేదు. ఒకవేళ క్వార్టర్ కావాలంటే అద్దె, వైద్యం కావాలంటే ఫీజు చెల్లించాల్సిందేనని రిటైర్డ్ ఉద్యోగులు వాపోతున్నారు. ఇదివరకు ఇలాంటి పరిస్థితి లేదని చెబుతున్నారు. ఆస్పత్రిలో ఉచితంగా మందులు పంపిణీ చేసేవారని, వైద్యసేవలు అందించేవారని గుర్తు చేస్తున్నారు. సింగరేణిలో ఉద్యోగం చేయడంతోనే అనారోగ్యానికి గురయ్యామని పలువురు వాపోతున్నారు. సింగరేణి ఆస్పత్రిలో ఉచిత వైద్యసౌకర్యం కల్పించాలని అన్ని కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జ్వరంతో వెళ్తే రూ.4,439 రికవరీ

మందమర్రి ఏరియాలోని ఓ రిటైర్డ్ ఉద్యోగి భార్య గత నెల 9న ఉదయం జ్వరంతో మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని–1 డిస్పెన్సరీకి వెళ్లింది. వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చి పంపారు. మధ్యాహ్నం వరకు జ్వరం ఎక్కువ కాగా మళ్లీ డిస్పెన్సరీకి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. సీపీఆర్ఎస్ కార్డు ఉందా? అని పేషెంట్‌ను అక్కడి వైద్యసిబ్బంది అడగగా ఉందని చెప్పింది. వెంటనే ఆస్పత్రిలో చేర్చుకుని వివిధ పరీక్షలు చేశారు. అవసరమైన సేవలందించి మర్నాడు మధ్యాహ్నం డిశ్చార్జి చేశారు. డిశ్చార్జి సమయంలో రిటైర్డ్ ఉద్యోగి సీపీఆర్ఎస్ (హెల్త్ కార్డు) నుంచి రూ.4,439 రికవరీ అయినట్లు మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్ చూసి రిటైర్డ్ ఉద్యోగి షాకయ్యాడు. పైగా ఆస్పత్రికి వెళ్తే ఇందుకు సంబంధించిన బిల్లు ఇవ్వడానికి నాలుగు రోజులు తిప్పుకొన్నారు. ఇరవై నాలుగు గంటలు కూడా ఆస్పత్రిలో లేకున్నా రూ.4,439 రికవరీ చేయడమేమిటని బాధితుడు బోరుమన్నాడు.

ఉచిత వైద్యం అందించాలి

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు సంస్థ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలి. ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి స్పెషలిస్టులు, సిబ్బందిని భర్తీ చేయాలి. సీపీఆర్ఎంఎస్ నుంచి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందితేనే డబ్బులు రికవరీ చేయాలి. సీపీఆర్ఎంఎస్ సౌకర్యం అందుబాటులో ఉన్న ఆస్పత్రుల్లో కార్మికుల వివరాలు ఉంచేలా యాజమాన్యం చర్య తీసుకోవాలి.

– సలేంద్ర సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి, మందమర్రి ఏరియా

ఇన్‌పేషెంట్ల నుంచి రికవరీ చేస్తాం

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ.20వేలు రికవరీ చేసుకున్న వారికి రూ.4లక్షల వరకు, రూ.40వేలు రికవరీ చేసుకున్న వారికి రూ.8లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య ఖర్చులకు సీపీఆర్ఎంఎస్ కార్డులు అందించాం. సింగరేణి ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్లకు ఉచిత సేవలందిస్తున్నాం. ఇన్‌పేషెంట్లకే కార్పొరేట్ ఆస్పత్రుల్లో అయ్యే ఖర్చులో 40 శాతం బిల్లు కింద సీపీఆర్ఎంఎస్ నుంచి రికవరీ చేస్తున్నాం. ఇందుకు సంబంధించి సర్క్యులర్ గతేడాదే వచ్చింది.

– ఉషారాణి, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రి

రౌడీషీటర్ దారుణ హత్య


సంతోష్‌రెడ్డి (ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన రౌడీషీటర్ చందుపట్ల సంతోష్‌రెడ్డి (38) దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియాలోగల త్రైబానగర్ కాలనీలో భారత్ హోటల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సంతోష్‌రెడ్డి స్థానిక భారత్ హోటల్ యజమానితోపాటు, పలువురిని డబ్బుల కోసం రెండురోజులుగా వేధింపులకు గురిచేశాడు. ఈ క్రమంలో సంతోష్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం హోటల్‌కు రాగా, అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు పథకం ప్రకారం ముందుగా కత్తితో దాడి చేశారు. ఆపై గొంతు కోశారు. తీవ్రగాయాలైన సంతోష్‌రెడ్డి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కాగా, సంతోష్‌రెడ్డిపై మూడు హత్య కేసులు, మరో 13 బెదిరింపులు, పలు దొంగతనాల కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. ఓ కేసులో ఇటీవలే బెయిల్‌పై వచ్చిన రౌడీషీటర్ సంతోష్‌రెడ్డిని కాగజ్‌నగర్‌లో ఉండరాదంటూ శుక్రవారం ఉదయమే ప్యాసింజర్ రైలు ఎక్కించారు. ఆయన ఆసిఫాబాద్‌రోడ్డు రైల్వేస్టేషన్‌లో దిగి, మళ్లీ కాగజ్‌నగర్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య ఉండగా, ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నట్లు తెలిసింది. కాగా, ఘటనా స్థలాన్ని ఎస్పీ సురేశ్‌కుమార్ సందర్శించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌హెచ్‌వో బీ స్వామి తెలిపారు.

'టీడీపీ మద్దతు ఏపార్టీకీ లేదు'


మాట్లాడుతున్న సంజయ్

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో తాము పోటీ చేయడంలేదని, ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని టీటీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పార్టీకి రాజీనామా చేయడం, జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జైలుకు వెళ్లడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నాయకులు అమానుల్లాఖాన్, ఎండీ షరీఫా, అంబాల మచ్చయ్య, సత్యనారాయణ నామసాని, లక్ష్మీరాజం, పల్లె వెంకటి, ప్రకాశ్, శ్రీనివాస్, తిరుపతి, రమేశ్, కార్తీక్, వెంకటేశ్ తదితరులున్నారు.

శివకుమార్‌కు డాక్టరేట్ ప్రదానం



గవర్నర్ చేతుల మీదుగా పట్టా తీసుకుంటున్న శివకుమార్

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన సందబోయిన శివకుమార్ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 'కస్టమర్ సాటిస్ఫాక్షన్ టు వర్డ్స్ గ్రీన్ బ్యాంకింగ్ ప్రాక్టీస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై చేసిన పరిశోధనకు యూనివర్సిటీ మూడో స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన శివకుమార్ స్థానిక శ్రీహర్ష జూనియర్ కళాశాలలో సీఈసీ, శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ పూర్తి చేసి మంచి ర్యాంకులు పొందారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎంకాం చదివి మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ఈ సందర్భంగా శివకుమార్‌ను శుక్రవారం కళాశాలలో కరస్పాండెంట్ పల్లె భూమేశ్, అధ్యాపకులు అభినందించారు.



ఆరోగ్య ధన ప్రాప్తిరస్తు!

ఇవాళ ధనత్రయోదశి. దీనినే ధన్ తేరస్ అని కూడా అంటారు. ఈ పర్వదినాన సాధారణంగా అందరికీ బంగారం, వెండి, గృహోపకరణాలు, వస్తు వాహనాల వంటి వాటి మీదికే దృష్టి మళ్లుతుంది. ఆరోగ్య ప్రదాత అయిన ధన్వంతరి జయంతి కూడా ఇదే రోజు అని గుర్తు రాదు. అయితే ఆరోగ్యం కూడా ధనమే కాబట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు ఏం చేయాలో తెలుసుకుని అందుకు తగినట్లు నడుచుకుంటే ఆరోగ్య ధనం, ఆరోగ్య మహాభాగ్యం సమకూరుతుంది. ధన త్రయోదశి సందర్భంగా ఆరోగ్య సంపదను ఏవిధంగా పెంపొందించుకోవాలో చూద్దాం...

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార విహారాలు ఎంత అవసరమో, నిత్యం నడక, వ్యాయామం, యోగా కూడా అంతే అవసరం. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు. అజీర్తి నుంచి ఆర్థరైటిస్ వరకు.. బీపీ నుంచి హార్టెటాక్ వరకు, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకు ఏదైనా నయం కావాలంటే రోజూ వ్యాయామం, యోగా చేస్తుండాలి.

■ సమయానికి తగు...



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంత అవసరమో ఆ ఆహారాన్ని తగిన సమయానికి తీసుకోవడం కూడా అంతే అవసరం. వేళ తప్పి భోజనం చేస్తే అది మన ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. అందువల్ల ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సరైన సమయాలకు భోజనం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

■ బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి

రోజూ ఉదయాన్నే టిఫిన్ చేయడం వల్ల ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. కొందరికి అలా బ్రేక్ ఫాస్ట్ చేయడం అలవాటు ఉండదు. అలాంటి వారు అల్పాహారంగా నానబెట్టిన బాదం, ఎండు ద్రాక్ష, వాల్నట్స్, మొలకెత్తిన గింజలు, అవిసెలు, తాజాపండ్లు, కూరగాయల ముక్కలు లాంటివి అయినా తప్పనిసరిగా తీసుకోవాలి.



■ లంచ్‌గా ఇవి...

మధ్యాహ్నపు భోజనంగా సగం కంచంలో తాజా కూరగాయలు, మిగతా సగంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.



రక్తంలో చక్కెర నిల్వల్ని అదుపులో ఉంచుకోవడానికి, లో గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు లాంటి చిరుధాన్యాన్ని ప్రయత్నించవచ్చు.

ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. ఎందుకంటే, మనం వాడే ప్లాస్టిక్ వస్తువుల నుండి, రోజుకి కొన్ని లక్షల సూక్ష్మరేణువులు విడుదలవుతాయి. వాటిలో ఉండే రసాయనం హార్మోన్ల సమతౌల్యాన్ని దెబ్బ తీస్తుంది.

■ మానసిక దృఢత్వం

మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు. ఇందుకోసం నిత్యం నడక, వ్యాయామం, యోగా తప్పనిసరి. ప్రధానంగా ఇవి అనేక రుగ్మతలకు దివ్య ఔషధాలు.

■ కంటినిండా నిద్ర

కడుపు నిండా తిని కంటి నిండా నిద్ర పోతే ఏ జబ్బూ ఉండదని పెద్దవాళ్లనేవారు. వేళకు తగినంత రాత్రి నిద్ర ఉంటే పొద్దున లేవగానే ఉత్సాహంగా ఉంటుంది. లేదంటే నిస్సత్తువగా... ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర లేమి వల్ల రకరకాల ఇతర జబ్బులు వస్తాయి. అందువల్ల వీలయినంత వరకు వయసును బట్టి, చేసే శారీరక శ్రమను అనుసరించి తగినంత నిద్ర పోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.



ఈ ధన త్రయోదశి నాడు అందరూ ఆరోగ్య ధనాన్ని పెంపొందించుకునే దిశగా అడుగులు వేస్తారని, వేయాలనీ ఆశిద్దాం.

మంచి కొవ్వు మంచిదే!



లావవుతామనే భయంతో చాలామంది కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాలను తినడం మానేస్తున్నారు. కొందరైతే నెయ్యి తినడం ఎప్పుడో మానేశారు. అయితే శరీరంలోని ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వులో మాత్రమే కరుగుతాయి. కాబట్టి తగిన పరిమాణంలో మంచి కొలెస్ట్రాల్ ఎంతో అవసరం. అలాగని అన్నిరకాల కొవ్వులూ ఆరోగ్యం కాదు. ఇంతకూ ఆరోగ్యకరమైన కొవ్వు లభించాలంటే ఎలాంటి ఆహారాలు తీసుకోవాలో తెలుసుకుందామా?

మీరు ఆరోగ్యం పట్ల చాలా కాన్షియస్‌గా ఉండి..అధిక పరిమాణంలో కొలెస్ట్రాల్ ఉన్న ఆహారాలకు దూరంగా ఉంటే తప్పకుండా ఈ అవకాడోను ఆహారంలో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఉండే మోనోశాచురేటెడ్ కొవ్వు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.

ఆలివ్ ఆయిల్: వేపుళ్లకు దూరంగా ఉండేవారు తప్పకుండా ఆహారాల్లో ఆలివ్ ఆయిల్‌ను తప్పకుండా వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు, మోనోశాచురేటెడ్ కొవ్వులు గుండెను ఆరోగ్యంగా చేసేందుకు సహాయపడతాయి. అంతేకాకుండా శరీర బరువును నియంత్రించేందుకు కూడా సహాయపడతాయి.

పెరుగు: బరువు తగ్గడానికి ఆరోగ్యకరమైన ఆహారాలు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకుంటే శరీరంలోని కొవ్వును సమతుల్యంగా చేస్తుంది. కాబట్టి శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తప్పకుండా కొవ్వు పాలతో చేసిన పెరుగు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ప్రేగును కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి.

కొబ్బరి: కొబ్బరి లేదా కొబ్బరి నూనె తీసుకోవడం వల్ల శరీరానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో జీర్ణక్రియను మెరుగుపరిచే చాలా రకాల పోషకాలు దొరుకుతాయి. దీనివల్ల ట్రైగ్లిజరైడ్ ఫుడ్ సులభంగా జీర్ణమవుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, ఇతర పొట్ట సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

చేపలు: చేపలలో మంచి కొలెస్టరాల్‌ను పెంపొందించే లక్షణాలున్నాయి. అందుకే ఇతర విధాలైన మాంసాహారాలకు దూరంగా ఉండమని హెచ్చరించే వైద్యులు సైతం పరిమితంగా అయినా చేపలు తీసుకోవచ్చునని చెబుతారు.

బాదం పప్పు, జీడిపప్పు: వీటిని తీసుకోవడం వల్ల కొవ్వు పెరుగుతుందని అనుకుంటాం. అయితే వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే ఉంటాయి. అందువల్ల బాదం, జీడిపప్పు తీసుకోవడం మంచిది. బాదం పప్పును నీటిలో నానబెట్టి, పైన పొట్టు తీసి తినడం మంచిది. జీడిపప్పును అయితే వేయించకుండా నేరుగా తీసుకోవడం వల్ల మంచి కొలెస్టరాల్ పెంపొందుతుంది.

నెయ్యి: ఇదివరకటిలో ఆహారంలో నేతిని బాగా ఉపయోగించేవారు. అరిసెలు, గారెలు వంటి వాటిని నేతితోనే చేసేవారు. అయితే రానురానూ నెయ్యి తినడం ఆరోగ్యానికి మంచిది కాదనే అభిప్రాయం స్థిరపడిపోయింది. నిజానికి నేతిలో శరీరానికి అవసరమైన పోషకాలెన్నో ఉన్నాయి. అలాగని ముద్ద ముద్దకీ నెయ్యి వేసుకోవడం, నేతితోనే చేసిన డీప్ ఫ్రైలు విపరీతంగా తీసుకోవడం మాత్రం అంత మంచిది కాదు. గేదె నెయ్యి కన్నా ఆవు నెయ్యి మంచిది.

మరకలను మాయం చెయ్యండి ఇలా...



బట్టలపై మరకలు పడ్డప్పుడు డ్రై క్లీనింగ్‌కి ఇద్దామంటే ఆ ధరకు కొత్తదే వస్తుందమే అనిపిస్తుంది. అయితే మరకలను తొలగించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేమిటో చూద్దాం.

మీ దుస్తులు మెరిసేలా చేయాలంటే ఆస్పిరిన్ మాత్రలు బాగా ఉపయోగపడతాయి. ఆస్పిరిన్‌లో ఉండే ఎసిటైల్‌సాలిసిలిక్ ఆమ్లం బట్టలపై పడిన మరకలను తొలగించేందుకు సాయం చేస్తుంది. తెల్లని దుస్తులను నాలుగైదు ఆస్పిరిన్ టాబ్లెట్లు వేసిన నీళ్ల బకెట్‌లో బాగా నానబెట్టండి. తరవాత బట్టల సబ్బుతో ఉతకడమో లేదా వాషింగ్ మెషీన్‌లో వేసి మామూలుగా ఉతికి జాడించి ఆరేస్తే సరి!

రక్తపు మరకలను తొలగించడానికి.. ఆస్పిరిన్‌ను చల్లటి నీటిలో కరిగించి బట్టలను నానబెట్టండి. వేడినీటితో రక్తపు మరకలను తొలగించడానికి ప్రయత్నించవద్దు. ఇది ప్రోటీన్లు గడ్డకట్టడానికి కారణమవుతుంది. ఆ తరువాత మరకను తొలగించడం కష్టం అవుతుంది. చేస్తుంది.

నూనె, గ్రీజు మరకలకు

ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కోయాలి. ఒక ముక్క మీద ఉప్పు వేసి మరకపై రుద్దాలి. ఇది నిమిషాల్లో బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

వక్కపొడి, పాన్ మసాలా మరకలు

పెరుగు లేదా మజ్జిగను మరక పడ్డ చోట ఉంచి పది నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత శుభ్రమైన నీటితో వస్త్రాన్ని కడగాలి. ఇది బట్టలపై ఉన్న మరకలను తొలగిస్తుంది.

టీ–కాఫీ మరకలు

టీ–కాఫీ మరకలు పడ్డప్పుడు ముందుగా గోరువెచ్చటి నీటిలో ఆ వస్త్రాన్ని పదిహేను నిమిషాలు ఉంచిన తర్వాత లిక్విడ్ డిటర్జెంట్లో నానబెట్టాలి. తర్వాత మరక పడ్డ చోట చేతితో రుద్దితే మరకలు తొలగుతాయి.

టర్కీ టవళ్లు, దుప్పట్ల వంటి వాటిని బట్టలుతికే సోడా కలిపిన నీటిలో నానబెట్టి ఉతికితే త్వరగా శుభ్ర పడతాయి.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ–మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

వేటాడే సత్యభామ



● కాజల్

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసిన ట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిధున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

రెండు హృదయాల కల



● జాన్వీ కపూర్

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

సరికొత్త ట్రయల్



● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

మాస్ రింగు...



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘురామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.